సెల్ఫ్

విధ్యుక్త ధర్మం!

ఎస్. ఎన్. ప్రభల

శతసహస్ర విధాలుగా ప్రయత్నాలు చేసిన అనంతరం గాని కామేశ్వరరావుకి ఆ వూరి హైస్కూలులో అవడం చిన్న ఉద్యోగమే ఐనా—ఓ పట్టానలభించలేదు! అయితే అతనికి మాత్రం యీ విషయంలో చీమకుట్టినట్లయినా అవలేదు.

• • •

నిజమే—

మూడు వాయిదాలలో బి. ఏ. పట్టా తెచ్చుకున్నాడు.

పట్టా వచ్చిన ఏడే పెళ్ళిచేసుకోవడంవల్ల-బి. ఇ. డి. ఇప్పుడు చదువుదామా లేక మీదటికి వాయిదా వేద్దామా అని ఎప్పటికప్పుడు అనుకుంటూ ఉండగానే శ్రీమతి ఓ చిన్న చిరంజీవిని చేతి కందించింది!

మనవడికి రెండో ఏడు వచ్చినా కూడా అల్లుడు నిరుద్యోగిగా ఉండడం కామేశ్వరరావు మావగారికి మెడమీద పదిమళ్ళ బరువుంచినట్లవగా కందువా దులుపుకుని శకునం చూసుకుని బయలుదేరారు, ఓ సుముహూర్తాన. అల్లుడికి ఓ ఉద్యోగం చూడడం కూడా, తన 'విధ్యుక్తధర్మా'లలో ఒకటి కాబోలనుకుంటూ.

ఎన్ని ఊర్లు తిరిగినా...ఎంత మందిని కలుసుకున్నా ఫలితం ఏమాత్రం కనిపించకపోవడంతో సదరు మావగారికి ఎక్కడలేని చిరాకూ పట్టుకుంది. ఐనా ఆ ఆర్భకుడి చిరాకులు 'విధ్యుక్త ధర్మం' ముందు తలలొంచక తప్పలేదు.

ఎవరూ వినకుండా ఓ నిట్టూర్పు మాత్రం విడుచుకున్నారు ఓ రోజున ఆయన— అలసటతో తల ముందుకు వంచుకుని!

ముందుకు వంగిన తల తాలూకు రెండుకళ్ళూ తోటకూర కాడల్లాగా వడలిపోయిన కాళ్ళను, ఆ కాళ్ళబాపతు అరిగి అట్టలూడిపోయిన చెప్పులనూ చూసి సిగ్గుతో మూతలుపడి పోయాయి... సానుభూతి సూచకంగా చెమ్మగిల్లాయి అంతకన్న చేసేదేమీ లేనట్లుగా!

ఆ స్థితిలో దొర్లుకుంటూ వస్తూన్న పూర్వ స్మృతులలో ఒక్క విషయంమాత్రం ఆయనను నిలవేసింది.

ఎదిగిన ఆడబిడ్డ నట్టింట్లో తిరుగుతూంటే ఆమెవేసిన ప్రతి అడుగూ ఒక్కొక్క సమ్మెట వేటులా తనను వేధిస్తూండగా యిప్పుడంత దారుణంగా కాకపోయినా యిట్లాగే వాడవాడా తిరిగాడు...సగటున నెలకు వందచొప్పున శుల్కం పెంచుకుంటూ.

చివరికి ఆస్తి అంతగా లేకపోయినా అమ్మాయి అదృష్టం బాగుంటే ఉన్న ఊర్లోనే అబ్బాయేదో ఉద్యోగం సంపాదించడా అని అనుకుని, అడిగిన 'కట్నం లెఖ్ఖపెట్టుకోడ'ని అంతా అయిందనిపించారు. అనుకోవడం అయితే అలా అనుకున్నారు గాని, ఆ అమ్మాయ మైనర్ కావడంవల్లనో లేక మరే సూత్రం ప్రకారంగానో ఆ పిల్లతాలూకు అదృష్టానికి తన అదృష్టం బాధ్యతవహించవలసివచ్చింది.

నిరుద్యోగి అయిన అల్లుడు నిరుత్సాహపడిపోకుండా, జీవితమంటే యింతే నమకుని బెదిరిబేజారెత్తిపోకుండా, సౌభాగ్యవతి చిల్లర కర్చులకనో చిరంజీవి సరదాలకనో వంకపెట్టి ప్రతివారం అయిదూ పదీ పంపవలసి వచ్చేది! ఆ అవసరాలు కూడా అధికంకావడంతో ఆయనగారి 'విధ్యుక్త ధర్మం' యొక్క నిజస్వరూపం ప్రత్యక్షమయి కార్యక్రమం సూచించడంవల్లనే తానీనాడు ఎండనకా కొండనకా ఉన్న ఊరును కన్న కూతురుకోసం విడిచి యిలా తిరగవలసి వచ్చింది.

ఎండినవాణ్ణి ఎలాగా ఎండానుకదా, సర్కారు జిల్లాలుకూడా ఓమాటు పర్యటించి, అదృష్టాన్ని పరీక్షించుకుని పరిస్థితులనవగాహన చేసుకుందామని బుద్ధిపుట్టిందాయన కీరోజున.

ఆబ్బాయి వయసు పాతికకేనాడో పైబడినందున ప్రభుత్వంవారి పైకం తినే యోగం తన కూతురుకు లేకపోయింది. పోతే 'ఏ హైస్కూల్లోనో ఓ చిన్న ఉద్యోగం చూడు నాన్నా' అని సౌభాగ్యవతి ఓసారి వ్రాయడంవల్ల తను కూడా కొత్త పుంతలు త్రొక్కవలసి వచ్చింది. ఉభయగోదావరులు కూడా అల్లుడికి ఆశ్రయం యివ్వడానికి నిరసన తెలపగా కట్టెలాగా నిర్జీవంగా తానోనాడు వాళ్ళిద్దీరాన నలబడిపోతే...అద్దరిని ఓ ఊర్లో ఓ పాత స్నేహితుడు హెచ్. ఎం. అని ఓ ఆచూకీ తెలిసింది.

పేదవానికి పెన్నిధి దొరికింది!

ఓ అరడజను పెద్ద బతాయిపళ్ళూ ఓ డజను తెల్ల చెక్కెరకేళీలూ తీసుకుని ఓ సుప్రభాతాన బయలు దేరారు.

సంభాషణ రసంలో పడ్డాక తా నొచ్చిన పని తెలియజేయగా సదరు హెచ్. ఎం. అతి విచారంగా పొంగి పొర్లుతూన్న సానుభూతితో—

"బి.ఇ.డీ.అయినా బాగుండిపోను!పోనీ బి.ఏలో క్లాస్ వచ్చినా కాస్త సర్దుకుపోవచ్చు. చూడండీ ప్రైవేట్ యిన్‌స్టిట్యూషను కమిటీ మెంబర్లు ఎవరికి వారే సర్వాధికార్లు! ఏదైనా గొడవచ్చిందంటే..."

"ఎల్లాగయినా ... మిమ్మల్ని చూసి యింత దూరం వచ్చాను."

"కాని మూడు డింకాలు కొట్టి డిగ్రీ తెచ్చుకున్న యితనికి ఉద్యోగం యిస్తే బి. ఇ. డీ లంతా నోల పెట్టరుటండీ! అదలా ఉంచితే కమిటీ తాలూకు రికమెండేషన్లు నానాటికీ హెచ్చిపోతున్నాయి."

"అలా అంటేకాదు ఎలాగైనా...చివరికి నా ముఖం చూసైనా..."

హెచ్. ఎం. కూడా కష్టసుఖాలు తెలిసిన వాడవటంవల్లా, ముందు జన్మలో తనకిలాటి పరిస్థితి రాకుండా ఉండేటందుకుగాను "ఓ టెంపరరీజాబ్ చూస్తాను వెళ్ళిరం"డని పంపించాడు.

ఇదేవిషయం ఆర్జంటు ఉత్తరంలో అల్లుడికి తెలియజేస్తూ అప్పటికైనా తన ఎధ్యుక్త ధర్మం నెరవేరిందో లేదో అని చూసుకుందుకు యింటి దారి పట్టారు—ఎలాగైనా సర్కారు జిల్లాల వాళ్ళు కష్టసుఖాలు ఎరిగిన వాళ్ళనుకుంటూ—

ఆయన జీవితంలో చాలా భాగం కూతురికి వరుణ్ణి వెతకడంలోనూ, ఆ వరుడికి జీవనోపాధిని కలిగించడంలోనూ హరించుకుపోయింది. చిన్నవాడు కొసరి కొసరి కూడబెట్టిన కండలు కరగిపోయాయి. నడుం వంగిపోయింది—సత్తవ చచ్చిపోయింది!

ఐనా కూడా ఎవరూ ఆయన పడిన కష్టానికి కృతజ్ఞత చూపరు. ఆఖరికి అల్లుడి మాట దేవుడెరుగు అమ్మాయికూడా సానుభూతి సూచకంగా ఓ చిన్న చిరునవ్వైనా!...

అయినా ఆయన కీ వయసులో తన విధ్యుక్త ధర్మం తాను నిర్వర్తించుకున్నానన్న తృప్తి తప్ప యింకేం కావాలి?

* * *

పరిస్థితులు యిలా ఓ దరిజేరిన తర్వాత... అంటే అయిదారు వారాల అనంతరం...అమ్మాయి వద్దనుంచి ఆయన కీ 'లేఖ' వచ్చింది.."ఈవూరులో మేము వేగలేం బాబూ...ఆయనకీ పల్లెటూరు నరకంకన్నా కూడా కష్టంగా ఉంది" అంటూ ఆ చివరే తాజాకలంలో—"ఇంకెక్కడేనా కొంచెం మంచి ఉద్యోగం చూడు నాన్నా! ఇప్పుడు యిది రెజైన్ చేసి మా ఊర్లోనే ఉంటున్నాం" అని కూడా ఉంది.

ఆ ఉత్తరం పట్టుకుని ఆ మావగారల్లాగే కూలబడ్డారు!

ఎలాగైతేనేం ధైర్యం తెచ్చుకుని యువకుడు అమ్మాయి తండ్రితో అన్నాడు: "మీ అమ్మాయి నన్ను తప్ప యింకెవరినీ చేసుకోనని అంటోందండీ!"-అని.

అమ్మాయి తండ్రి చిరాగ్గా యిలా అన్నాడు: "దానికి నన్నేం చేయమంటావు? చేసుకున్న ఖర్మ అనుభవించు. అహర్నిశలూ దాని వెంటపడి మతి పోగొట్టుకుంటే మరేమవుతుంది?"